

# మందాకిని నిర్వేదం

ఈరోజున నేను యౌవనవతిని కాను. ఐనా వార్థక్యం నా శరీరంలో మాత్రమే. నా మనస్సు, అంటే నా కోరికలు, నీ కోరికలకన్నా యౌవనంగానే ఉన్నవి. అయితే మీరందరూ శరీరాన్ని చూసి స్త్రీని ప్రేమిస్తారు. కాదు మోహిస్తారు.

నేను బస్తీలో పుట్టి పెరగలేదు. భాగ్యవంతుల ఇంటిలో పెరగలేదు. అంత నిరు పేదల ఇంటి లోనూ పెరగలేదు. మొదటినుంచీ కష్టపడి పని చేసుకోవడం నాకు తెలుసు. బహుశా ఆ విషయం మీ అందరికంటే ఎక్కువగానే నాకు తెలుసు. కాని నీకు వచ్చినన్ని మాటలు నాకు రావు.

నా కోరికలే నాచేత మాట్లాడిస్తవి. ఆ మాటలు నాగరికత తెలిసిన నీ మనసునకు మోటు గానూ నాటుగానూ కనిపించవచ్చు. కాని నేను ఏకోరికను బలహీనంగా నీకు తెలియ చేస్తున్నానో ఆ కోరిక తీర్చుకునేసమయంలో నువ్వూ నేనూ- బహుశా మనలాంటి అందరూ నామాదిరే మోటుగా ఉంటారు. కాని మోటుతనంలోనే ఒక రకమైన ఆనందం ఉన్నది అని నిజం ఒప్పు కునే వాడివయితే నువ్వూ అంగీకరిస్తావు.

నిన్ను నేను బలవంతం చెయ్యాడం లేదనుకుం టాను. నా స్థితిలో నువ్వే వుండి నేనే చిన్నపిల్ల నయితే నువ్వు యీ అవకాశంలోనన్ను బలవం తంగా కౌగిలించుకునే వాడివి. ఆ పని మీ మగ జాతికే తగును. నేను నీనుంచి కోరేది మాటలు కావు.

నిన్ను ఏదీ ఉచితంగా అడగటంలేదు. నా చేతనయిన సహాయం నీకు నువ్వు ఈ ఊరువచ్చి నప్పటినుంచీ చేసి అడుగుతున్నాను. నా కోరిక నీకు అనేకరకాలుగా నానోటిమీదుగా కాకుండా తెలియచేశాను. నీకు తెలిసో తెలియకో నన్ను గుర్తించనట్లూ, పెద్ద వేదాంతిలాగా మెలిగావు. ఆఖరికి ఈనాడు మనకు దొరికిన ఈ ఏకాంత సమయంలో ఇలా బయట పడుతున్నాం.

నీకన్న అందమయినవాళ్లు నాకు దొరకక కాదు. ఇదివరకు ఈ విషయంలో కొంత అల్లరి పడ్డాను. అల్లరేకాదు, ఆఖరికి ఇహ ఎట్లా బ్రత కడం అనేటంతటి పరిస్థితి వచ్చింది. నీవీ విష యంలో పడేనంటే ఇతర్ల అనుమానానికి గురి కావాల్సిన అవసరం ఉండదు. అసలు ఇతర్లు అను మానించరుకూడా.

నువ్వు ఈ యింటికి తరుచు అనేక కారణాల వలన వచ్చిపోతున్నావు. కనుక ప్రత్యేకం నీకూ నాకూ ఉన్న బాంధవ్యం వలననే వస్తున్నావని ఎవరూ అనుకోరు. ఈ ఇంటిఆయనకూ నీకూగల స్నేహకారణంవలననే ఇక్కడికి వస్తున్నావని అనుకుంటారు.

*　　*　　*

మొన్న నేను నా కోరిక బయటపెట్టిన తరు వాత నువ్వు ఇటు రావడం మానివేశావు. నాకు

వి. యస్. అవధాని

నీమీద కోపం రావడం లేదు. జాలి వేస్తున్నది. ఈ విషయంలో నా కోరికను తీర్చడం కంటే నీ సంగతే నువ్వు ఎక్కువ ఆలోచించుకోవాలి.

నేనెటూ మంచిదాన్ని కాదు. కొంతమంది నన్ను మొదట్నుంచీ ఎరుగుదురు.

నేను భాగ్యవంతురాలను కాకపోవడంవల్ల నువ్వు ఇప్పుడుంటున్న ఇంటాయనకిచ్చి మా వాళ్లు నన్ను పెళ్ళి చేశారు. కాపరానికివచ్చిన రెండేళ్ళలోనే నాకొక పిల్లవాడు పుట్టాడు.

ఇదంతా ఎందుకు చెప్తున్నా ననుకొన్నావు? స్త్రీ హృదయం తెలియచెయ్యడానికి. కొన్ని కొన్ని కారణాల వలన స్త్రీ కోరిక ఎన్నటికీ చావదు. మన సంఘ పరిస్థితు లటువంటివి. ఆ సంగతి నేను నీకు ఇంత విపులంగా చెప్పనవసరం లేదు. కాని నాసంగతిచెప్పి నిన్ను నా వాణ్ణిగా చేసుకుందామనే నా యీ ప్రయత్నం.

నా తప్పిదం యేమీ లేకుండానే నేనీ యింటికి బానిస నయాను. ఆ బానిసత్వంకూడా పట్టి బానిసత్వం కాదు. డబ్బిచ్చి తెచ్చుకున్న బానిసత్వం.

నా పిల్లవాడు బాలింగేండ్లు పెరిగి చచ్చిపోయినాడు. తరువాత రెండేండ్లకు సంఘం నాకు యిచ్చిన భర్తకూడా చచ్చిపోయినాడు. తరువాత నేనీ పిల్లను తీసుకు వచ్చి పెంచాను.

ఆ పిల్లకు పెండ్లియీడు వచ్చేసరికి ఇప్పుడు నీవు చేస్తున్న ఉద్యోగం చెయ్యడానికి ఈవూరు ఒకాయన వచ్చాడు. ఆయన పేరు చెప్పను. అసలీ సంగతి నన్ను చాలా బాధ పెడుతోంది. కాని నాది ఇతర స్త్రీలవంటి పాలపొంగు తత్వం కాదు అని అనడానికే ఇదంతా చెపుతున్నాను. అంత అవమానాన్నీ సహించి ఇట్లా చెప్పగలుగుతున్నాను.

ఆయన చక్కగా పాడగలడు. ఎన్నోసార్లు మా ప్రెసిడెంటు ఈ యింట్లో ఆయన చేత పాడించాడు. ఆ పాటలన్నీ నన్ను పరవశం చేసినాయి. అయితే అప్పట్లో ఈ యింటికి నాకూ ఇంత సంబంధం లేదు.

నీ విప్పుడున్న యింట్లో నేనూ ఈ ప్రెసిడెంటు భార్యా ఒంటరిగా ఉండేవాళ్ళం. నేను నా బలహీనత వలననే ఆనుకో 'ఆయన' వశం అయాను. ఆయనకొక కొడుకున్నాడు. ఆయనకు ఈ పిల్లను చేయడానికీ, నాకు నా భర్తవల్ల వచ్చిన ఆస్తిని వాళ్ళకియ్యడానికీ ఏర్పాటు చేసుకున్నాం.

మీ మగజాతిని నేను ఎన్నటికీ నమ్మను. అవసరాన్నిబట్టి మీరు మా వెంట బానిసలవలె తిరుగుతారని నాకు తెలుసు. మీ వశం అయిన ఆడదానికి వచ్చే బాధలనూ ఇబ్బందులనూ మీరు ఆదుకోలేరని నాకు తెలుసు. ఇది నాకు అనుభవం కూడా.

మా సంబంధం ఖాయం అయి కొద్దికాలంలో పెండ్లి జరుగుతుందనగా ఈ సంగతంతా మా పినతండ్రికి తెలిసింది. అదివరకూ తెలుసు. కాని ఆ సమయానికి ఆయనకు ఈ ప్రెసిడెంటు సహాయం అవసరం అయింది. ప్రెసిడెంటు చాలా పలుకుబడి గలవాడు. ఆయనతో ఎలాగయినా గట్టి సంబంధం పెట్టుకుంటేనేగాని మా బాబాయి గండం గడవదు. అంచేత నన్ను రచ్చకెక్కించాడు.

ఒక అర్ధరాత్రి వేళ నేనూ 'ఆయనా' ఏకాంతంగా ఉన్నప్పుడు వాళ్లిద్దరూ మా ఇంటిమీద పడ్డారు. నానా గోలా చేశారు. నన్ను చావకొట్టారు. నాకు ముసలితనం ఆనాటినుంచే రావాలిసింది. కాని అట్లా జరగలేదు.

"ఆస్తి అంతా ప్రెసిడెంటు పేర రాస్తేనే గాని వదలమని బలవంతం చేశారు. ప్రాణం కాపాడుకోవడానికి అట్లా చేయవలసి వచ్చింది. నేను ప్రేమించిన ఆ పెద్దమనిషీ, ఆయన కొడుకూ ఆ రాత్రే ఎటో ఉడాయించారు. ఇంతవరకూ పత్తా లేదు. అందుకే ఈ మగజాతిని నమ్మరాదని నే ననేది.

తరువాత నా ఇష్టంతో సంబంధం లేకుండానే ఈ నా పెంపుడు పిల్ల ఈ ప్రెసిడెంటుతో బాంధవ్యం పెట్టుకున్నది. నా కళ్ళ ఎదుటనే వాళ్ళ వ్యవహారాలన్నీ సాగినాయి. అసలే నష్టి వయస్సుదాన్ని. అందులో సంస్కారం అంతగా లేనిదాన్ని. కళ్ళ ఎదుట శృంగారం జరుగుతూంటే నా కోరికలూ ఇంకా ఎక్కువయినవి. నేనీనాడు ముసలిదాన్ని కాకపోవడానికి గల కారణాలలో ఇది రెండోది.

తరువాత ఒక ఏడాదికి ఈ ప్రెసిడెంటు నాకు అల్లుడయినాడు. ఆ పెళ్ళయిన తరువాత

ఈ ప్రెసిడెంటు తిరిగి రెండో పెళ్ళి చేసుకున్నాడు.

భార్య ఉన్న మగవాడు ఎట్లా ప్రవర్తించినా మీ సభ్యతా సంఘం గర్హించదు. భర్తలేని స్త్రీ తన సహజమైన కోరికను పెండ్లి అనే గుదిబండ లేకుండా తీర్చుకుంటే మీరు సహించలేరు. అవును, నువ్వు వెళ్ళిపోతావు వెళ్లు. ఇంకొక సారయినా నీ మనసు కరగక తప్పదు.

* * *

బాధపడి ప్రయోజనం లేదు. పోయిన వాళ్లతో మనము పోము. లేనిదాన్ని ఊహించుకుని బాధపడడం కన్న ఉన్నదానిని అనుభవించడంలోనే ఎక్కువ సుఖం ఉంటుంది. నీకన్న ఎక్కువ చదువుకున్నదాన్ని కాను.

నీకంటే వయస్సులో పెద్దదాన్ని. కనుకనే నాతో సహచర్యానికి నువ్వు మొదట్లో అనుమానించావు. కాని నీకన్న పెద్దదాన్ని కావడం చేతనే నా అనుభవం కూడా గొప్పది. సంస్కారం లేని అనుభవం అనుభవం కాకపోదు. నా జీవితంలో ఎన్నో బాధలను చూశాను.

నేను ఎవరి మనిషిని అని ప్రశ్నించుకుంటే ఈనాడు నా స్థితి చాలా అయోమయంగా ఉంటుంది. అయినా ఆరిపోయిన ఒక పాత అనుభవం నీ స్నేహంతో పొందగలుగుతున్నాను. నీకు హృదయం ఉన్నది. అనుభవం లేదు. సంస్కారం ఉన్నది. ధైర్యం లేదు. ఈ రెండే నా ధనాలు. వీటితో నిన్ను ఆదరించగలను. నీకు తోడునీడగా ఉంటాను.

నా ఆస్తి అంతా కాకపోయినా కొంతయినా నీ కారణంగా మళ్ళీ నాచేతికి వచ్చింది. ఇక మనకు చింత లేదు. పోయిన నీ భార్య తిరిగి రాదు. ఎన్నాళ్ళు నువ్వు ఆ కిటికీ దగ్గర కూర్చుని తపస్సు చేసినా, ఆ మొక్కనీ ఈ మొక్కనీ నువ్వు ఎన్నాళ్ళు లాలించినా శారద తిరిగి రాదు. శారద నీకిచ్చిన సాహచర్యమూ సుఖమూ నీకు నా ద్వారా వస్తాయి.

అయితే నేను శారదను మాత్రం కాను. శారద పిచ్చిబాగుల పిల్ల. మొదట్లో పరాయి ఆడదానితో మాట్లాడడానికే జంకే నువ్వు ఈ రోజు నాతో తిరుగుతూంటే ఆ పిల్ల సహించగల్గింది. ఆ సుశీలతోనూ, ఈ కమలతోనూ నువ్వు కులుకుతానంటే నేను సహించను.

పద, నీ ఇష్టం వచ్చిన చోటికి పోదాం. నా ఆస్తి నీదయింది. ఏదో సాకున దాన్ని రొక్కంగా మార్చగలిగాను. ఈ సమాజానికి దూరంగా పోదాం పద. తల్లిగా నిన్ను లాలిస్తాను. ప్రియురాలిగా నిన్ను సుఖపెడతాను. అవసరమయినపుడు అదుపాజ్ఞలతో పెడతాను.

నీ తెలివిని కట్టడి చేసేవాళ్ళు లేకపోబట్టే నీవింత అసమర్థుడిలాగా తయారయావు. ఈ నాటినుంచీ అవి ఉడకవు.

నీ తెలివిని నువ్వు ఉపయోగించుకుని ఇతర్లకుపయోగించే విధం నేను చూపుతాను. ఏం, ఏంమటావు?

బాగా సెలవిచ్చారు !

“నీ జీవితము చరితార్థమయింది. బ్రహ్మదేవునివలె అక్షరరమ్యమయిన సృజన సలిపితివి. విష్ణుదేవునివలె వివిధ కళావ్రతులను రంజింప చేసితివి. మహాదేవునివలె వాగర్థవిభూతిని వెదజల్లినావు. దృష్టమయిన లోకంలో అదృష్టప్రకాశనముతోపాటు పౌరుషేయమైన అలౌకిక ప్రభావం కూడా మేళనమై నీ జీవితంలో చరితార్థ పురుషార్థములు నిష్ణాతంగా విలీనములయినవి.”-(చెళ్ళపిళ్ళ శతావధాని నిర్యాణంపై కృష్ణాపత్రికలో రాయప్రోలు)